క్లుప్తంగా

6న భట్టిప్రోలులో ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు: శ్రీకృష్ణ యాదవ సేవా సమితి (అద్దేపల్లి) ఆధ్వర్యంలో మండల స్థాయి పోలు రాధా ఎడ్ల పోటీలు సెప్టెంబర్ 6న స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీలోగా పోటీదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ.15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందించనున్నట్లు తెలిపారు. ఈ ఎడ్ల పోటీలను విశ్రాంత ఏఎస్పీ కుందేటి కృష్ణార్జునరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహిస్తామని వివరాలకు 94418 05503, 94906 43749 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పంట నమోదు పరిశీలన



వేమూరు: రైతులు, కౌలు రైతులు సాగు చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి సునీత కోరారు. వేమూరు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. రైతులందరూ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని, పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. పంట నమోదు ఇన్సూరెన్స్‌కు, పంట నష్టపోతే పరిహారానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆమె తెలిపారు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు ప్రాథమిక పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు మంగళవారం పరిశీలించారు. పనులు సత్వరం పూర్తి చేయాలని పీఎంసీ నిర్వాహకులను ఆదేశించారు. వారి వెంట హెచ్‌ఎం గుజ్జర్లమూడి స్వామి, ఉపాధ్యాయులు బండి రామకోటయ్య, పీఎంసీ చైర్‌పర్సన్ పి.కమలమ్మ, సభ్యులు ఉన్నారు.

'రజక' సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యుడిగా అంకమ్మరావు




భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యుడిగా భట్టిప్రోలుకు చెందిన కె.అంకమ్మరావు ఎన్నికైనట్లు చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.బాలాజీ మంగళవారం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయనను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో అంకమ్మరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ నాయకులు బందారు శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, టి.రఘురామ్‌ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరగాలని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పిట్టలవానిపాలెం: మండలంలో బాపట్ల ఎస్ఈబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు చందోలు సమీపంలో ఇసుక లోడుతో వెళ్తున్న రెండు ట్రాక్టర్‌లను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని చందోలు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

'వేమూరు'లో ఓటరు జాబితా సర్వే పూర్తి

నియోజకవర్గ ఎన్నికల అధికారి మోహనరావు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మోహనరావు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వే వంద శాతం పూర్తయిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ మోహనరావు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. వేమూరు నియోజకవర్గంలో 1,92,515 ఓట్లు ఉన్నాయని వెల్లడించారు. మొత్తం ఐదు మండలాల్లో బూత్ లెవల్ అధికారులు సర్వే చేశారని తెలిపారు. ఇందులో గ్రామంలో నివశించని వారి ఓట్లు 1,180, గ్రామం నుంచి వెళ్లిపోయిన వారు 840, వివిధ ప్రాంతాల్లో ఓటు ఉన్న వారు 243, మరణించిన వ్యక్తుల ఓట్లు 2,357 గుర్తించినట్లు మోహనరావు వెల్లడించారు. ప్రతి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఓటు తొలగింపు కోసం ఫిర్యాదు చేస్తే వారికి నోటీసులు జారీ చేయడం జరుగుందన్నారు. సమాధానం కోసం రెండుమూడు సార్లు నోటీసులు ఇస్తామన్నారు. ఎలాంటి స్పందన లేకుంటే ఓటు తొలగించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఓటు నమోదు, తొలగింపు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మెహర్, కనకదుర్గ, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు..అభివృద్ధికి సహకరించండి

- ఎంపీపీ యల్లమాటి మోహన్
- వేమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం
- అభివృద్ధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లమాటి మోహన్, అధికారులు

వేమూరు: అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అభివృద్ధి కుంటుపడుతోందని ఎంపీపీ యల్లమాటి మోహన్ అన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మోహన్ అధ్యక్షత వహించి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జంపని గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు సమస్యలు పట్టించుకోవడం లేదని వైస్ ఎంపీపీ షేక్ బాజీ ఆరోపించారు. విద్యుత్ శాఖ ఏఈ గోపీ మాట్లాడుతూ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు సక్రమంగా పనిచేయకపోతే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. పెరవలిలో విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పూర్తయితే మండలంలో విద్యుత్ సమస్యలు ఉండవని ఆయన తెలిపారు. పంచాయతీ రాజ్ ఏఈ డి.మరియదాసు నిర్లక్ష్యంతో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి జరగడం లేదని ఎంపీటీసీలు ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తే మండలం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బొప్పన శేఖర్, వైఎస్ ఎంపీపీ దాసరి శివపార్వతి, మండల కో-ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, ఎంపీటీసీ వేమూరి సుజాత, ఈపూరు కుసుమ, అల్లూరు యోన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ వకుల్ జిందాల్ రాక నేడు

వేమూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించేందుకు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఉదయం 10 గంటలకు రానున్నట్లు ఎస్ఐ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఉప సర్పంచి మృతి



కర్లపాలెం: ఏట్రవారిపాలెం గ్రామ ఉప సర్పంచ్ ఏట్ర రామ్మూర్తిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ నాయకుడై రామ్మూర్తిరెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన రెండవ పర్యాయం ఏట్రవారిపాలెం ఉప సర్పంచిగా పనిచేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి రామ్మూర్తిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, పిట్ల పోలిరెడ్డి నివాళులర్పించారు.

దమ్ము చక్రాలతో రోడ్లకు ముప్పు..



కొల్లూరు: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రహదారులపై ప్రయాణిస్తుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయని వాహనదారులు అంటున్నారు. ఖరీఫ్ సాగుకు పొలాలు దమ్ము చేయడానికి వినియోగిస్తున్న ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను తగిలించుకుని రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు కోతకు గురవుతున్నాయి. దమ్ము చక్రాలు రోడ్లపై ఆనకుండా టైర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులు, వాహనదారులు సూచిస్తున్నారు.

సాయిబాబు సేవలు ఎనలేనివి



సాయిబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ తన జీవితాన్ని త్యాగం చేసిన సాయిబాబు సేవలు ఎనలేనివని సీపీఎం డివిజన్ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం సీపీఎం నాయకుడు దివి సాయిబాబు వర్ధంతి నిర్వహించారు. పార్టీ రేపల్లె డివిజన్ కార్యదర్శిగా, సీఐటీయూ నాయకుడిగా రేపల్లె ప్రాంతంలో కార్మిక, రైతు, వ్యవసాయ, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు సాయిబాబు విజయవంతంగా చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీఎల్‌కే ప్రసాద్, వై.కిషోర్, ఆశీర్వాదం, లక్ష్మణరావు, రమేష్ పాల్గొన్నారు.

బాధిత చిన్నారి కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ చేయూత

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులో అత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబాన్ని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు మంగళవారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. చిన్నారి చదువు నిమిత్తం ఐదేళ్ల పాటు ఏటా రూ.10వేలు ఆర్థిక సహాయం అందిస్తామని భరోసానిచ్చారు. ఫౌండేషన్ ప్రచార కమిటీ కన్వీనర్ యన్నం సురేష్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పీటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వాకా వెంకట నారాయణ, మాజీ ఎంపీటీసీ పీటా వెంకటేశ్వరావు, న్యాయవాది పమిడిముక్కల సాయిరామ్, ఫౌండేషన్ సభ్యులు కంభం సురేష్, గుడివల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయంలో చక్రస్థాపన మహోత్సవాలు



విద్యుద్దీప వెలుగుల్లో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం

నేటి నుంచి 25 వరకు విశేష పూజలు



ఆలయంలో కొలువుదీరిన వీరభద్రస్వామి

యనమదల (ప్రత్తిపాడు): యనమదలలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం చక్రస్థాపన మహోత్సవాలకు ముస్తాబయ్యింది. గ్రామంలో కొలువుదీరిన వీరభద్రుని దేవాలయంలో ఈ నెల 23 నుంచి శ్రీ చక్రస్థాపన మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు వాసు శర్మ తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం కంకణధారణ, 108 అఖండాలతో శ్రీ చక్ర సహిత గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించనున్నారు. గురువార అంకురారోపణ, వాస్తుహోమం, హోమ క్రతువులు, శ్రీచక్ర స్వరూపిణి అయిన అమ్మవారికి విశేష పూజలు జరపనున్నారు. అనంతరం రుద్రహోమం, నవగ్రహోమం, దాన్యాధివాసం జరగనున్నాయని చెప్పారు. 25న సామూహిక కుంకుమార్చన, వీరభద్రునికి పల్లెర మహోత్సవాన్ని నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం జరగనుందని వాసుశర్మ వివరించారు. సాయంత్రం చండీహోమం, శ్రీచక్రస్థాపన జరుగుతుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీప కాంతులతో దేవస్థానం అలరారుతోంది.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

చేబ్రోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ పొన్నూరు సీఐ సుకన్య మంగళవారం అరెస్ట్ చేశారు. బ్రాహ్మణ కోడూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని, ఆమె నుంచి 37 మద్యం క్వార్టర్ బ్యాటిల్స్ స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ గీతిక, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఏపీఎంకు వినతి

పెదకాకాని: డ్వాక్రా యానిమేటర్ల(వీఓఏ) వేతనాలు పెంచాలని పెదకాకాని ఏపీఎం రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు తెలియజేశారు. ఏళ్ల తరబడిన పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు బ్యాంకు ఖాతాలకు వేయాలని, అర్హులైన వారికి సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాకాని పద్మ, వి.వెంకటలక్ష్మి, వి.విజయలక్ష్మి, రాజశ్రీ, అరుణ, పద్మినీ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి



బాపట్లటౌన్: మత పరమైన పూజలు, ప్రార్థనలు చేసుకునే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ పి.కృష్ణయ్య తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పట్టణంలోని మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలిగించకుండా ప్రార్థనలు, పూజలు చేసుకోవాలన్నారు. చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో స్పీకర్లు, డీజే బాక్సుల శబ్దాన్ని తగ్గించుకోవాలని సూచించారు. అధిక శబ్దంతో పరిసర ప్రాంతాల్లోని రోగులకు, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇమాములు, పాస్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై ఫిర్యాదు

బాపట్లటౌన్: ఆటోను నిర్లక్ష్యంగా తోలడంతో తనకు గాయాలయ్యాయని తమ్మిశెట్టి చందు అనే వ్యక్తి పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని రైలుపేటకు చెందిన తమ్మిశెట్టి చందు ఆటోలో ప్రయాణిస్తుండగా డ్రైవర్ మణి నిర్లక్ష్యంగా ఆటో తోలుతూ పాత బస్టాండ్‌లోని కోన ప్రభాకరరావు విగ్రహం దిమ్మను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో చందుకు గాయాలయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

కర్లపాలెం: మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై కర్లపాలెం పోలీసులు మంగళవారం దాడి చేసి, పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2.500 నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు.

వైఎస్సార్ సీపీలో యువకుల చేరిక



పార్టీలో చేరిన వారితో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. నిజాంపట్నంలోని 20 కుటుంబాల యువకులు మంగళవారం మోపిదేవి వ్యక్తిగత కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. కుట్ర రాజకీయాలు చేయటం, ప్రజలను మభ్యపెట్టడం టీడీపీకే చెల్లుతుందని ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి విమర్శించారు. దీనికి నిదర్శనం నిజాంపట్నంకు చెందిన పలువురు యువకులను ప్రలోభాలకు గురిచేసి, టీడీపీ నాయకులు తమ పార్టీలో చేరినట్లుగా కండువాలు కప్పారని తెలిపారు. ఆ యువకులు తమ తప్పు తెలుసుకుని ఎల్లప్పటికి సీఎం జగనన్న వెంటే ఉంటామని వైఎస్సార్ సీపీలో చేరారని ఆయన పేర్కొన్నారు. ప్రసాద్, గోపీ, శ్రీను, మోపిదేవి వెంకటేష్, యోగి, సతీష్, సుందరయ్య, ప్రమోద్, కృష్ణబాబు, మహేష్, కేసన తదితరులు పార్టీలో చేరారు.

అనవసర ఆరోపణలు సరికాదు

మాజీ మంత్రికి ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ హితవు



పడమట శ్రీనివాసరావు

భట్టిప్రోలు: వెల్లటూరులోని చిన్నారిపై జరిగిన అఘాయిత్యం సమాచారం తెలియగానే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తీవ్ర దిగ్భ్రాంతికి గురికావడమే కాక, తక్షణం నిందితుడిని అరెస్టు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయం తెలియని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పలు విధాలుగా ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. మంగళవారం భట్టిప్రోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి తన స్వగ్రామంలో ఇలాంటి ఘటన జరగడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యారని చెప్పారు. నిందితుడు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని అప్పటికప్పుడు కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించి, అరెస్టు చేయించారని వివరించారు. అయితే మాజీ మంత్రి.. గ్రామస్తులు, టీడీపీ నాయకుల చర్యలతోనే పోలీసులు స్పందించారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చిన్నారి ఘటనకు, పోలింగ్ బూత్ మార్పునకు ఏ సంబంధం ఉందని ప్రశ్నించారు.

బడే కాల్వలో పూడికతీత ప్రారంభం



సింగుపాలెంలో బడే కాల్వ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న అంజయ్య

రేపల్లె రూరల్: ప్రజలు, రైతుల సమస్యలపై తక్షణమే స్పందించే మనస్సున్న నాయకుడు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య అన్నారు. బడే కాల్వలో పూడికతీత చేపట్టాలని ఇటీవల రైతులు ఎంపీని కోరారు. దీంతో స్పందించిన ఆయన సొంత ఖర్చులతో పూడిక తీయించేందుకు నిర్ణయించారు. ఈ పనులను మంగళవారం అంజయ్య ప్రారంభించారు. బడే కాల్వలో పూడిక వల్ల సింగుపాలెం, విశ్వేశ్వరం, కై తేపల్లి, మోర్తోట తదితర గ్రామాల్లోని పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి ఎంపీ మోపిదేవి ప్రత్యేక చొరవ చూపటంతో రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శివనాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

చెరుకుపల్లి: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు బాపట్ల జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ యువత అధ్యక్షుడు కొట్రా నాంచారయ్య పేర్కొన్నారు. చెరుకుపల్లి కాపు కల్యాణ మండపంలో మంగళవారం చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా అభిమానులు చిరంజీవి పుట్టిన రోజు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ వసంత రాఘవయ్య, సంజీవిని హాస్పిటల్ డాక్టర్ కమ్మెల హరీష్, అభిమానులు మొగలిపువ్వ సుబ్రహ్మణ్యం, మొఖమాటం పృథ్వీ, దాసరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

బాపట్ల: సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం అభిమానుల ఆధ్వర్యంలో రక్తదానం, రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక శ్రీనివాస్ మహల్ థియేటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఏరియా వైద్యశాలలో రక్తదానం చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి అభిమానులు కూనపురెడ్డి అవినాష్ నాయుడు, సాయి, ఆంజనీష్, విష్ణు మొలకల చంద్రమోహన్, తులసమ్మ ఉన్నారు.

కర్లపాలెంలో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు

కర్లపాలెం: కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలు కర్లపాలెంలో మంగళవారం ఘనంగా జరిగాయి. జనసేన, చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి, పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర నర్సింగ్ హోంలో డాక్టర్ రమణ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి అభిమానులు ఎస్.తేజ, జి.శ్రీకృష్ణ, సుధాకర్, ఆకుల నారాయణ, సురేంద్ర, సత్తార్, శ్రావణకుమార్ ఉన్నారు.

అసైన్డ్ భూముల నివేదిక సిద్ధం చేయాలి

జాయింట్ కలెక్టర్ ఎస్.రాజకుమారి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

పెదకాకాని: అసైన్డ్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రాజకుమారి ఆదేశించారు. మండలంలోని నంబూరు గ్రామ సచివాలయంలో మంగళవారం వీఆర్వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం నగదు రైతుల ఖాతాలకు జమ కావడం లేదని, అందుకు గల కారణాలు చెప్పాలని వీఏఏలను కోరారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంలో జాప్యంపై వివరణ కోరారు. మండలంలో జరుగుతున్న భూముల రీ-సర్వేలో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ఎసైన్‌మెంట్ భూములకు సంబంధించిన వివరాలు, ప్రస్తుతం ఆ భూముల్లో సాగుచేస్తున్న వారు ప్రారంభం నుంచి ఉన్నారా, వారసులు సాగు చేస్తున్నారా, ఆక్రమించుకుని లీజుకు ఇస్తున్నారా అన్న వివరాలు సేకరించాలని ఆదేశించారు. అలానే అసైన్డు భూములలో నివాసాలపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని జేసీ చెప్పారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ విధానాన్ని మెరుగు పరచుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వి.రత్నం, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, వీఆర్వోలు, వీఏఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ బదిలీ

తెనాలిరూరల్: తెనాలి ట్రాఫిక్ ఎస్ఐ జె. శ్రీనివాస్ బదిలీ అయ్యారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో ఇక్కడ రిలీవ్ అయ్యారు. బి.శివరామయ్య ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్ బదిలీతో ఆయన పూర్తి బాధ్యతలు చేపట్టారు.